# దేశ భక్తుడు ధర్మన్న

నిమ్న జాతిలో రత్నము, నీతితోడ
ధర్మ నిరతి తో హరిజన తారకుడయి
జాతిబేధములను త్రుంచ జగతిలోన
కలమును ఝుళిపించుచు విప్పెగళముచాల!

దళిత జాతి సంస్కరణల తనను తాను
మలచుకొని నాయుధమ్ముగా మెలగినాడు
కర కమలమున కూర్చుచు కవనములను
అంకితమ్ము చేసుకొనెను అమరజీవి!

ఆశయమ్ము నంబేద్కరు, డభ్యుదయము
కొఱకు కృషి జేసె 'ధర్మన్న' గొప్పగాను
హరిజనుల కొరకానంద హరిత వనపు
ఆశ్రమముల స్థాపన చేసి అమరుడాయె!

కందుకూరి ప్రభావిత కార్యముఖుడు
వీరుడై అలుపెరుగక విజయభేరి
శబ్దమున జయభేరిని స్థాపనమ్ము
జేసి సంస్కరణల నిల్చె శ్రీకరుండు!

తృష్ణ దీక్షగా, సేవయే కృషిగ మలచి
దేశ మాతకు ఋణమును తీర్చుకొనుచు
రాజమండ్రి సుశోభిత రత్నమనగ
భువిన వెల్గి శాశ్వతముగ దివిననిల్చె!

శాంతా లక్ష్మి మునిమడుగు